క్లుప్తంగా

తొగలుగల్లులో నీటి ఎద్దడి



మంచినీటి కోసం మినీ ట్యాంకుల వద్ద గుమిగూడిన గ్రామస్తులు

ఆస్పరి: మండలంలోని తొగలుగల్లు గ్రామంలో నీటి ఎద్దడితో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గ్రామానికి సరఫరా చేసే రెండు బోర్లలో ఒకటి మాత్రమే పని చేస్తుందని, ఆ బోరు నుంచి కూడా సరిపడ నీరు రాకపోవడంతో అవస్థలు పడుతున్నామని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నీటి సమస్యపై మండల అధికారులకు చెప్పినా పట్టించుకోవడం లేదన్నారు. అరకొరగా వచ్చే నీటి కోసం రాత్రింబవళ్లు ట్యాంకుల వద్ద పడిగాపులు కాయాల్సి వస్తుందన్నారు. అధికారులు ట్యాంకర్ల ద్వారా నీరు సరఫరా చేయాలని కోరుతున్నారు.

భగవద్గీతపై ప్రచారం



కోట వీధిలో ప్రచారం చేస్తున్న ప్రబోధ సమితి సభ్యులు

ఆలూరు రూరల్: పట్టణంలోని కోట వీధిలో ఆదివారం త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి ఇందూ జ్ఞాన వేదిక సభ్యులు ఆదివారం త్రైత సిద్ధాంత భగవద్గీతపై ప్రచారం నిర్వహించారు. పూర్వం శ్రీ కృష్ణాష్టమిని 11 రోజుల పాటు నిర్వహించి, చవితి రోజున ఊరేగింపు చేసి వేడుకలు ముగించేవారని ప్రబోధ సేవా సమితి సభ్యులు తెలిపారు. గుంతకల్లు, నాగసముద్రం కమిటీ అధ్యక్షులు కృష్ణమూర్తి, ధనుంజయ సభ్యులు దొనప్ప, శ్రీ వేణి, సర్వజ్ఞ, మల్లి,రాజేశ్వరి, చైతన్య,లక్ష్మి,సుధాకర్ పాల్గొన్నారు.

బైక్ ప్రమాదంలో యువకుడికి గాయాలు



గాయపడిన సుధాకర్

వెల్దుర్తి(కృష్ణగిరి): బ్రహ్మగుండం సమీపంలో ఆదివారం బైక్‌పై నుంచి పడి పట్టణానికి చెందిన బోయ సుధాకర్ గాయపడ్డాడు. బ్రహ్మగుండం క్షేత్రానికి సుధాకర్ తన మిత్రునితో కలిసి వెల్దుర్తి నుంచి రామళ్లకోట రోడ్డులో బయలుదేరాడు. సుజల స్రవంతి మదర్‌ప్లాంట్ దాటి ఇటుకల బట్టీల వద్దనున్న మలుపులో ఎదురుగా కారు రావడంతో బైక్ అదుపుతప్పింది. క్షతగాత్రుడిని 108 వాహనంలో కర్నూలు ఆసుపత్రికి తరలించారు.

ఉపాధి పనుల పరిశీలన



అమకతాడు సమీపంలో పండ్ల తోటను పరిశీలిస్తున్న ఆడిట్ సిబ్బంది

కృష్ణగిరి: ఉపాధి హామీ పథకం ద్వారా చేపట్టిన పనులను క్షేత్రస్థాయిలో పరిశీలిస్తున్నట్లు ఎస్‌ఆర్‌పీ విజయభాస్కర్ తెలిపారు. మండలంలోని అమకతాడు గ్రామంలో ఉపాధి హామీ పథకం కింద సాగు చేసిన పండ్ల మొక్కలను ఆదివారం ఆయన పరిశీలించారు. సామాజిక తనిఖీలో భాగంగా అన్ని గ్రామాల్లో డీఆర్పీల ద్వారా పనులను తనిఖీ చేయిస్తున్నామన్నారు. 2023 ఏప్రిల్ నుంచి 2024 మార్చి వరకు చేపట్టిన దాదాపుగా రూ.10 కోట్ల పనులకు సంబంధించి తనిఖీలు చేపడుతున్నామని, అందుకు అందరూ సహకరించాలని కోరారు. డీఆర్పీ చిన్నికృష్ణ, ఫీల్డ్ అసిస్టెంట్ శేఖర్, శ్రీనివాసులు, రజాక్ ఉన్నారు.

హ్యూమన్‌రైట్స్ జిల్లా చైర్మన్‌గా సాయికుమార్



డాక్టర్ రఫీ నుంచి నియామక పత్రాన్ని అందుకుంటున్న సాయికుమార్

తుగ్గలి: ఆలిండియా హ్యూమన్ రైట్స్ ఆర్గనైజేషన్ ఈగల్ (ఐ) జిల్లా చైర్మన్‌గా పత్తికొండకు చెందిన కటారుకొండ సాయికుమార్ నియమితులయ్యారు. రాష్ట్ర చైర్మన్ డాక్టర్ రఫీ ఆధ్వర్యంలో కర్నూలులో కమిటీని నియమించారని ఆదివారం ఆయన తెలిపారు. హ్యూమన్ రైట్స్ జిల్లా జనరల్ సెక్రటరీగా గిరీష్, సెక్రటరీలుగా రంగన్న, గురుస్వామి, లీగల్ అడ్వయిజర్‌గా మధు, సభ్యులుగా ఖాజాహుసేన్, విజయ్, సురేంద్ర, సతీష్‌ను నియమించినట్లు చెప్పారు.

రేపు ఎమ్మెల్యే రాక

హొళగుంద: ఈనెల 6వ తేదీన ఆలూరు ఎమ్మెల్యే బుసినే విరూపాక్షి మండల కేంద్రం హొళగుందకు రానున్నారని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ షఫివుల్లా ఆదివారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో మంగళవారం ఎంపీపీ తంబాకు నూర్జహాన్‌బీ అధ్యక్షతన జరిగే మండల సర్వసభ్య సమావేశంలో ఆయన పాల్గొంటారని చెప్పారు.



ఆలూరులోని ఇండోర్ స్టేడియం



జిమ్‌లో నిరుపయోగంగా సామగ్రి

లక్ష్యం మరుగు!

- ఆలూరు ప్రభుత్వ బాలుర పాఠశాలలో జిమ్ ఏర్పాటు
- కోచ్‌ను ఏర్పాటు చేయని ప్రభుత్వం
- పట్టించుకునే వారు లేక ఆరేళ్ల క్రితం మూత
- గ్రామీణ క్రీడాకారులకు అందుబాటులో లేని వైనం
- నిరుపయోగంగా జిమ్ పరికరాలు

ఆలూరు రూరల్: గ్రామీణ ప్రాంత విద్యార్థులు క్రీడల్లో రాణించాలని ప్రభుత్వం పట్టణంలోని ప్రభుత్వం బాలుర -2 పాఠశాలలోని ఇండోర్ స్టేడియంలో జిమ్ ఏర్పాటు చేసింది. ఇందుకు రూ.6లక్షలు వెచ్చించింది. కోచ్‌ను నియమించకపోవడం, నిర్వహణ లోపం కారణంగా ఆరేళ్ల క్రితం మూసిన జిమ్ తలుపులు నేటికీ తెరుచుకోకపోవడంతో లక్ష్యం మరుగున పడింది.

నిర్లక్ష్యపు చీడ..

పట్టణంలోని ప్రభుత్వ బాలుర-2 పాఠశాల ఆవరణలోనున్న ప్రభుత్వ ఇండోర్ స్టేడియంలోని జిమ్‌కు నిర్లక్ష్యపు చీడ పట్టింది. 2016 నవంబర్ 30న రూ.2.10 కోట్లతో ఆలూరులో నూతన ఇండోర్ స్టేడియం నిర్మించి ప్రారంభించారు.

ఇందులో క్రీడాకారులకు షటిల్ కోర్టుతో పాటు రూ.6 లక్షల విలువైన జిమ్ ఏర్పాటు చేవారు. డీఎస్‌ఏ (జిల్లా స్పోర్ట్స్ అథారిటీ) నిర్ణయించిన మేరకు రుసుము చెల్లించి జిమ్‌లో వ్యాయామం చేసుకునేలా వెసులుబాటు కల్పించారు. రెండేళ్ల పాటు జిమ్‌లో క్రీడాకారులు వ్యాయామం చేశారు.

జిమ్ అందుబాటులోకి తీసుకురావాలి



నేను ప్రస్తుతం జాతీయ స్థాయి సెపక్‌తక్రా పోటీలకు సిద్ధమవుతున్నా. ప్రాక్టీస్‌కు ముందు నాకు జిమ్ అవసరం. ఇండోర్ స్టేడియంలోని జిమ్ పరికరాలను మరమ్మతులు చేసి అందుబాటులో తీసుకురావాలి. గతంలో ఇది క్రీడాకారులకు ఎంతో ఉపయోగపడింది. వినియోగానికి నోచుకోకపోవడంతో జిమ్‌లో రూ.లక్షలు విలువ చేసే పరికరాలు వృథా అవుతున్నాయి.

– మధు, సెపక్‌తక్రా క్రీడాకారుడు,ఆలూరు

పరికరాలకు మరమ్మతులు చేయించాలి



ఆరేళ్ల క్రితం జిమ్‌లోని పరికరాలు వ్యాయామం చేయడానికి ఎంతో ఉపయోగపడేవి. ఆలూరులో ప్రైవేటు జిమ్‌లు లేవు. జిమ్‌ను మూసివేయడంతో తప్పని పరిస్థితుల్లో ఇంట్లోనే వ్యాయామం చేస్తున్నా. ప్రభుత్వ జిమ్‌లోని పరికరాలను మరమ్మతులు చేసి అందుబాటులోకి తీసుకొస్తే క్రీడాకారులు, యువకులకు ఎంతో ఉపయోగపడుతుంది.

– మున్నా,ఆలూరు

శిథిలావస్థకు చేరిన పరికరాలు..

2016లో ప్రారంభమైన జిమ్‌కు గతంలో స్థానిక క్రీడాకారులు ఉదయం, సాయంత్రం వ్యాయామం చేసేవారు. జిమ్‌లో ప్రత్యేక గదులతో పాటు టాయిలెట్స్ అందుబాటులో ఉండేవి. ప్రస్తుతం జిమ్ మూత పడటంతో రూ.లక్షల విలువ చేసే పరికరాలు నిరుపయోగంగా మారాయి. ఇలాగే కొద్ది రోజులు గడిస్తే జిమ్ పరికరాలను తుక్కు సామన్ల కింద వేయాల్సి వస్తుందని పలువురు పేర్కొంటున్నారు. పట్టణ నడిబొడ్డున ఉండే స్టేడియం క్రీడాకారులకు ఎంతో ఉపయోగం. క్రీడాశాఖ అధికారుల నిర్లక్ష్యం వల్ల జిమ్ అందుబాటులో రాలేకపోతోందని క్రీడాకారులు వాపోతున్నారు. అలాగే జిమ్‌లో కోచ్ ఏర్పాటు చేయాల్సి ఉంది. ఇండోర్ స్టేడియంకు 6 దుకాణాలతో షాపింగ్ కాంప్లెక్స్ ఉంది. వీటి నుంచి వచ్చే అద్దె నుంచి జిమ్ సామగ్రి కొనుగోలు చేయడం లేదా పరికరాలను మరమ్మతులు చేయించే అవకాశం ఉన్నా సంబంధిత అధికారులు ఆ దిశగా ఆలోచించడం లేదు.

ట్యాంకులను శుభ్రం చేయాలి

మద్దికెర : మండలంలోని గ్రామాల్లోనున్న ఓవర్ హెడ్ ట్యాంకులను ప్రతి 15 రోజులకొకసారి శుభ్రం చేయించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు ఈఓఆర్డీ మద్దిలేటిస్వామి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ మయాంక్ ఆదివారం తెలిపారు. బోర్లు, బావులు, నీటి పథకాలలో క్లోరినేషన్ బిళ్లలు వేసి నీరు కలుషితం కాకుండా చూస్తామన్నారు. పంచాయతీ సిబ్బంది అధికారుల సూచనలు పాటించాలని చెప్పారు.

యువకుడికి విద్యుత్ షాక్

మద్దికెర : స్థానిక సాయినగర్‌లో మిద్దె సమీపంలో విద్యుత్ మెయిన్ వైర్లు ఉండటంతో విద్యుత్ సరఫరా కావడంతో బాషా అనే యువకుడు షాక్‌కు గురైన సంఘటన ఆదివారం చోటు చేసుకుంది. కాలనీలో విద్యుత్ సరఫరా అయ్యే మెయిన్ వైర్లు తక్కువ ఎత్తులో ఉన్నాయి. పని నిమిత్తం మిద్దెపైకి ఎక్కిన బాషాకు వైర్ల నుంచి షాక్ కొట్టింది. గాయాలు కావడంతో గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే చికిత్స కోసం వైద్యశాలకు తరలించారు. ఇలా ఎప్పుడూ జరగలేదని కాలనీవాసులు తెలిపారు.

వైఎస్సార్‌సీపీ కార్యకర్త మృతి

వెల్దుర్తి(కృష్ణగిరి): పట్టణానికి చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త వడ్డె చిన్న ఆంజనేయులు ఉరఫ్ చిన్నోడు (55) శనివారం అనారోగ్యంతో మృతి చెందాడు. వడ్డెగేరిలో నివాసముంటున్న మృతుడు ఉదయం అకస్మాత్తుగా శ్వాస సంబంధిత అనారోగ్యానికి గురయ్యాడు. కుటుంబ సభ్యులు వెల్దుర్తి ఆసుపత్రికి తరలించగా కోలుకోలేక మృతి చెందాడు. విషయం తెలుసుకున్న పార్టీ మండల అధ్యక్షుడు బొమ్మన రవిరెడ్డి మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అలాగే వడ్డె గేరిలోనే నివాసముంటున్న వడ్డె నాగేశం కుమారుడు ప్రసాద్ (44) సైతం అనారోగ్యానికి గురై శనివారం మృతి చెందాడు.

మత్తుతో భవిష్యత్ అంధకారం



హొళగుంద బస్టాండులో ప్రజలకు అవగాహన కలిగిస్తున్న ఎస్‌ఐ పెద్దయ్యనాయుడు

హొళగుంద: మత్తు వ్యసనం ప్రజల జీవితాలను చిత్తు చేస్తుందని, భవిష్యత్ అంధాకారంగా మారుతుందని, ఒక సారి ఈ వ్యసనానికి బానిసగా మారితే జీవితాలు బుగ్గి అవుతాయని ఎస్‌ఐ పెద్దయ్యనాయుడు అన్నారు. ఆదివారం స్థానిక బస్టాండులో గంజాయి, మాదక ద్రవ్యాలపై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ ధూమపానం, మద్యం, గంజాయి, కొకైన్ లాంటివి యువతతో పాటు అన్ని వర్గాల ప్రజలను మత్తులో ముంచేస్తున్నాయని ఒకసారి వీటికి అలవాటు పడిన వారు వాటిని వదల్లేక ..చివరికి శారీరకంగా, మానసికంగా నిర్వీర్యమైపోతున్నారన్నారు. మంచి అలవాట్లు, క్రమశిక్షణ కలిగి ఉండి కుటుంబ సభ్యులతో ఆనందంగా గడపాలని సూచించారు. మత్తు పదార్థాల అమ్మకాలు, సేవించే వారి గురించి సమాచారం ఇచ్చి ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణానికి పునాదులు వేయాలని కోరారు.

వర్షం కురవాలని..



రాతనలో గ్రామ దేవత పాదాలకు జలాభిషేకం చేస్తున్న దృశ్యం



ఆస్పరిలో కప్పను ఊరేగిస్తున్న చిన్నారులు

తుగ్గలి : వర్షాలు కురిసి, సమృద్ధిగా పంటల పండాలని మండలంలోని రాతనలో గ్రామ దేవతకు బాలలు 101 బిందెలతో ఆదివారం జలాభిషేకం చేశారు. ఖరీఫ్ ప్రారంభంలో కురిసిన వర్షాలకు రైతులు పంటలు సాగు చేశారు. నెల రోజులుగా సరైన వర్షాల్లేక పంటలు వాడుతున్నాయి. మంచి అదునులో వర్షం రాకపోవడంతో వారిలో ఆందోళన మొదలైంది. వరుణ దేవుడు కరుణించి సమృద్ధిగా వర్షాలు కురవాలని అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి అన్నదాన కార్యక్రమం చేపట్టారు.

ఆస్పరి: వర్షం కోసం ఆయా గ్రామాల్లో ప్రజలు ఆలయాల్లో పూజలు,హోమాలు చేస్తున్నారు. ఇందులో భాగంగా మండల కేంద్రంఆస్పరిలో ఆదివారం చిన్నారులు కప్పను ఊరేగించి పూజలు చేశారు. నెల రోజులు నుంచి సరైన వర్షాలు పడకపోవడంతో గ్రామ పెద్దలు చిన్నారులతో కప్పను ఊరేగించి పూజలు చేయించారు. చిన్నారులు ఊరేగింపుగా వెళ్తూ 'కప్పకు వచ్చిన తిప్పలు వానదేవుడా' అంటూ ఊరంతా తిరిగారు. ఇలా చేస్తే వర్షం వస్తుందని గ్రామస్తుల నమ్మకం.

ఈశ్వరరెడ్డి, షడ్రక్ ఆశయాలను సాధిద్దాం



నివాళులస్తున్న సీపీఎం నాయకులు

దేవనకొండ: ప్రజాసేవకు అంకితమైన కామ్రేడ్ ఎర్రగుడి ఈశ్వరరెడ్డి, షడ్రక్ ఆశయాలను సాధిద్దామని సీపీఎం శాఖ కార్యదర్శి మహబూబ్‌బాషా, పార్టీ సీనియర్ నాయకులు బజారి, గాజుల శ్రీనివాసులు, రైతు సంఘం నాయకులు శ్రీరాములు పిలుపునిచ్చారు. ఆదివారం మండలంలోని తెర్నెకల్ గ్రామంలో ఈశ్వర్‌రెడ్డి, షడ్రక్ వర్ధంతి సభ నిర్వహించారు. ముందుగా వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. వారు మాట్లాడుతూ పార్టీ అభివృద్ధికి, సమస్యల పరిష్కారానికి వారు చేసిన కృషి మరువులేనిదన్నారు. కె.పి.రాముడు, లక్ష్మిరెడ్డి, రవి, సుధాకర్, ఎలియా, శివ, మధు పాల్గొన్నారు.

ఆస్పరి: మండల కేంద్రంలో కామ్రేడ్ షడ్రక్ 4వ వర్ధంతిని ఆదివారం జరుపుకున్నారు. సీపీఎం నాయకులు బాలకృష్ణ, రామాంజనేయులు, రంగస్వామి, రవి, ఫ్రాంచిస్, బలరాం, అబ్దుల్ షడ్రక్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రజలకు ఆయన చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు.

ఎల్లెల్సీ పరిశీలన



కాలువపై పర్యటిస్తున్న వీరభద్రగౌడ్, కాలువ అధికారులు

హాలహర్వి: మండలంలోని తుంగభద్ర దిగువ కాలువను టీడీపీ ఇన్‌చార్జ్ వీరభద్రగౌడ్ ఆదివారం పరిశీలించారు.అలాగే నిట్రవట్టి గ్రామంలో పర్యటించి ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం రైతుల పక్షాన ఉంటుందని చెప్పారు. తుంగభద్ర డ్యాంకు పెద్ద ఎత్తున వరదనీరు వచ్చి చేరడంతో దిగువ కాలువకు నీరు విడుదల చేశారన్నారు. నిట్రవట్టి గ్రామంలో నీటి సమస్య ఉండడంతో గ్రామానికి నీరు అందించడానికి రూ.10 లక్షలతో మోటార్లు ఏర్పాటు చేసి నీటిని పంపింగ్ చేస్తామన్నారు. కెనాల్ అధికారులు ఎస్డీఓ హుసేన్‌బాషా, జేఈ మహేశ్వరరెడ్డి, నాయకులు పాల్‌రెడ్డి, శ్రీధర్, మల్లప్ప, తిప్పేస్వామి, నాగరాజు, గాదిలింగ ఉన్నారు.

దారి సమస్యను పరిష్కరించండి..

ఆలూరు: స్థానిక ఎస్‌బీఐ, పోలీస్ స్టేషన్ మధ్యనున్న దారి ఇరుకుగా ఉండటంతో తమ పొలాలకు, ఇళ్లకు వెళ్లడానికి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఉరుకుంద ఈరన్న, కొట్టాల కాలనీ వాసులు ఆలూరు టీడీపీ ఇన్‌చార్జ్ వీరభద్ర గౌడ్, ప్రత్తిపాడు ఎమ్మెల్యే రామాంజనేయులు దృష్టికి ఆదివారం తీసుకెళ్లారు. సమస్యాత్మక ప్రాంతాన్ని వారు పరిశీలించారు. త్వరలోనే శాశ్వత పరిష్కారం చూపుతామని కాలనీవాసులకు హామీనిచ్చారు.

దేశ సంపద కార్పొరేట్ పరం



జి.ఎర్రగుడిలో మాట్లాడుతున్న రాంభూపాల్

తుగ్గలి: దేశ సంపదను కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం గంపగుత్తగా కార్పొరేట్ శక్తులకు అమ్ముతోందని, ప్రజా వ్యతిరేక విధానాలకు పాల్పడుతున్న మోదీ పాలనపై పోరాటం చేయాలని సీపీఎం అనంతపురం జిల్లా కార్యదర్శి రాంభూపాల్ పిలుపునిచ్చారు. మాజీ ఎమ్మెల్యే కామ్రేడ్ ఈశ్వరరెడ్డి వర్ధంతిని జీ.ఎర్రగుడిలో కుటుంబ సభ్యులు, పార్టీ శ్రేణుల ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. ఇంటి నుంచి ప్రదర్శనగా వెళ్లి స్థూపం వద్ద నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రాంభూపాల్ మాట్లాడుతూ ఈశ్వరరెడ్డి ఎమ్మెల్యేగా ఉన్నా ఏనాడూ స్వలాభం ఆశించకుండా పేదల సంక్షేమమే ధ్యేయంగా పనిచేశారన్నారు. ఈశ్వరరెడ్డి ఆశయ సాధన కోసం పార్టీ శ్రేణులు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఈశ్వరరెడ్డి మనమడు, ఏపీజీబీ రాయలసీమ ఉద్యోగుల సంఘం నాయకులు జగదీష్‌రెడ్డి, తనయులు భాస్కర రెడ్డి, రంగారెడ్డి, సీపీఎం నాయకులు రంగారెడ్డి, వీరశేఖర్, శ్రీరాములు, కొండారెడ్డి, సీపీఐ నాయకుడు సుల్తాన్ పాల్గొన్నారు.

త్వరలో ఇన్‌పుట్ సబ్సిడీ

మద్దికెర : మండలంలో 315 మంది రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ రావాల్సి ఉందని ప్రతి ఒక్కరికీ వస్తుందని ఆందోళన చెందవద్దని ఏఓ రవి ఆదివారం తెలిపారు. రైతుల జాబితాలో కొన్ని తప్పులు చోటు చేసుకోవడంతో పరిహారం జమ కాలేదన్నారు. ఈ విషయంపై జిల్లా కలెక్టర్, వ్యవసాయాశాఖాధికారులకు తెలియజేయడంతో అందని రైతుల జాబితాతో పాటు వారి సంతకాలు సేకరించి పంపాలని ఆదేశాలు జారీ చేశారని, వాటిని కూడా పంపామని చెప్పారు. త్వరలోనే రైతుల ఖాతాల్లో జమ చేస్తారని పేర్కొన్నారు.

నేటి నుంచి శ్రావణమాసం ప్రారంభం

ఆలూరు: నేటి నుంచి శ్రావణమాసం ప్రారంభమవుతుందని అర్చకులు నారాయణస్వామి తెలిపారు. మండల కేంద్రం సమీపంలోనున్న బెళ్లగుండ ఆంజనేయస్వామి ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. ఇందులో భాగంగా ఉదయం స్వామివారికి గంగపూజ, ఆకు పూజ, కుంకుమార్చన, పంచామృతాభిషేకం,మహామంగళహారతి తదితర పూజా కార్యక్రమాలు చేపట్టారు. భక్తులకు జెడ్పీటీసీ ఏరూరుశేఖర్ సహకారంతో అన్నదాం ఏర్పాటు చేసినట్లు ఆలయ నిర్వాహకులు శ్రీనివాసరెడ్డి, నాగేంద్ర య్యశెట్టి ,గండయ్యస్వామి తెలిపారు. అలాగే హత్తిబెళగళ్ గ్రామంలో పంతవెంకన్న ఆంజనేయస్వామికి అర్చకులు ప్రాణేచిఆచార్, వాసవి ఆలయంలో కన్యకాపరమేశ్వరి దేవికి అర్చకులు నరేంద్రశాస్త్రి పూజలు చేశారు.

రైతులను ఆదుకోవాలి

దేవనకొండ: జిల్లాలో కరువు తాండవిస్తోందని, రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని అఖిల భారత కిసాన్ మహాసభ సంఘం (ఏఐకేఎస్) జిల్లా నాయకుడు బోయ మునిస్వామి డిమాండ్ చేశారు. ఆదివారం మండలంలోని దేవనకొండ, కప్పట్రాళ్ల తదితర గ్రామాల్లో ఎండిపోయిన పంటలను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ పంటలు సాగు చేసి నెల గడుస్తున్నా మండలంలో వర్షం కురవకపోవడంతో పంటలు ఎండుతున్నాయన్నారు. ఇప్పటికే మొక్క ఎదుగుదల కోల్పోయిందన్నారు. ఇప్పటికే గతేడాది రబీ పంట నష్టపరిహారం చాలా మంది రైతులకు అందజేయలేదని, వెంటనే అందజేయాలని, జిల్లాను కరువు ప్రాంతంగా ప్రకటించి రైతులకు పరిహారం అందజేయాలని కోరారు. నాయకులు వీరేష్, చిన్నారి, ఎర్రిస్వామి, అంగడి వీరేష్, సుకూర్, మల్లి, రామాంజనేయులు, చాకలి చిన్నోడు పాల్గొన్నారు.

ఆధ్యాత్మికతను అలవర్చుకోవాలి

ఆలూరు: మానసిక ప్రశాంతత, ఆరోగ్యంగా ఉండాలంటే ఆధ్యాత్మికతను అలవర్చుకోవాలని త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచార కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు కృష్ణమూర్తి, ధనుంజయ సూచించారు. ఆదివారం స్థానిక ఆర్‌అండ్‌బీ అతిథి గృహం ఆవరణలో త్రైత సిద్ధాంత భగవద్గీత కరపత్రాలను విడుదల చేశారు.వారు మాట్లాడుతూ.. ఆహారపు అలవాట్లు, మానసిక ఒత్తిడిని తట్టుకుని సంపూర్ణమైన ఆరోగ్యాన్ని పొందాలంటే యోగా, ధ్యానం, వాకింగ్, ఆధ్యాత్మికతకు సంబంధించిన పుస్తకాలను చదవాలని చెప్పారు. దొనప్ప,శ్రీవేణి,సర్వజ్ఞ, మల్లి, రాజేశ్వరీ, సుధాకర్ పాల్గొన్నారు.

ఆటో..బైక్ ఢీ- ఇద్దరికి గాయాలు



ఆలూరు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రాముడు

ఆలూరు రూరల్: గుర్తుతెలియని ఓ ఆటో బైక్‌ను ఢీ కొట్టడంతో ఇద్దరు యువకులు గాయపడ్డారు. మండలంలోని కరిడిగుడ్డం గ్రామ సమీపంలో ఆదివారం రాత్రి 9 గంటలకు రోడ్డు ప్రమాదం జరిగింది. వివరాలు.. కరిడిగుడ్డం గ్రామానికి చెందిన రాము,హరి ఆలూరులో పని ముగించుకుని స్కూటర్‌పై స్వ గ్రామానికి వెళ్తున్నారు. గ్రామ సమీపంలోని కంకర మిషన్ వద్ద ఎల్లార్తి నుంచి ఆలూరుకు వస్తున్న గుర్తుతెలియని ఆటో బైక్‌ను ఢీ కొట్టింది. ప్రమాదంలో హరి కుడికాలు విరిగిపోయింది. రాముడికి గాయాలయ్యాయి. ప్రయాణికులు గమనించి 108 కు సమాచారం అందించి ఆలూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన చికిత్స కోసం వైద్యులు గుంతకల్లు ప్రభుత్వ ఆస్పత్రికి రెఫర్ చేశారు.

ఆధ్యాత్మికం

వైభవంగా చౌడేశ్వరి జయంత్యుత్సవాలు



పూజల్లో పాల్గొన్న భక్తులు

మద్దికెర : స్థానిక శ్రీచౌడేశ్వరి దేవాలయంలో తొగట వీర క్షత్రియ సంఘం వారు ఆదివారం అమ్మవారి జయంతి ఉత్సవాలను వైభవంగా నిర్వహించారు. ఆలయ పూజారి పల్లా ఆంజనేయులు ఆధ్వర్యంలో ఉదయం 6 గంటలకు గంగపూజ, గణపతి పూజ, అమ్మవారికి భక్తులు ఒడిబియ్యం పోశారు. అనంతరం పంచామృతాభిషేకం, సుగంధ ద్రవ్యాలతో అభిషేకం చేసి కుంకుమార్చన చేపట్టి మహామంగళ హారతి ఇచ్చారు. భక్తులకు అన్నదానం చేశారు.

ఆలయాల్లో అమావాస్య పూజలు



ప్రత్యేక అలంకరణలో క్షేత్రగుడి ఆంజనేయస్వామి, గూళ్యం గాదిలింగేశ్వరస్వామి

మద్దికెర : స్థానిక శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి దేవాలయంలో ఆదివారం అమావాస్య సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించి పంచామృతాభిషేకం, కుంకుమార్చన, ఆకుపూజలు, మహా మంగళ హారతి కార్యక్రమాలు చేపట్టారు. పూజలకు విచ్చేసిన భక్తులకు అన్నదానం చేశారు. అలాగే మద్దమాంబ ఆలయంలో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి ప్రత్యేక పూజలు జరిపించారు.

హాలహర్వి: మండలంలోని క్షేత్రగుడి ఆంజనేయస్వామి, గూళ్యం గాదిలింగేశ్వరస్వామి, అమృతాపురం టోపీ మారెమ్మవ్వ ఆలయాల్లో ఆదివారం అమావాస్యను పురస్కరించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం నుంచి స్వామివార్లకు జలాభిషేకం, పంచామృతాభిషేకం, కుంకుమార్చన, మహామంగళహారతి తదితర విశేష పూజలు నిర్వహించారు. ఆంధ్ర నుంచే గాక కర్ణాటక రాష్ట్రం నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామి వార్లను దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. క్షేత్రగుడి, గూళ్యం గ్రామాల్లోని ఆలయాల్లో అన్నదానం ఏర్పాటు చేశారు.



గాయత్రీ మాత

ఆస్పరి: మండలంలోని రామతీర్థంలోని రామలింగేశ్వరస్వామి, గాయత్రీ మాత, ఆస్పరిలోని మారెమ్మవ్వ, కన్యకాపరమేశ్వరీ మాత, పక్కీరప్పతాత, శంకరబండలోని లింగమేశ్వర స్వామి, కైరుప్పలలోని వీరభద్రస్వామి, చిన్నహోతూరులోని సిద్ధలింగేశ్వర స్వామి, తంగరడోణలోని చింతలమునిస్వామి, నల్లారెడ్డి స్వామి ఆలయాల్లో ఆదివారం అమావాస్య సందర్భంగా విశేష పూజలు నిర్వహించారు. ఆలయాల్లో స్వామి వార్లకు గంగ, ఆకుపూజ, కుంకుమార్చన, మంగళహారతులు తదితర కార్యక్రమాలు చేపట్టారు. ఆయా ఆలయాల్లో స్వామి వార్లను దర్శించుకునేందుకు భక్తులు తరలివచ్చారు.

భక్తులతో కిటకిటలాడిన దేవరగట్టు, ఎల్లార్తి



హొళగుంద: అమావాస్య, ఆదివారం సందర్భంగా మండలంలోని ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ముఖ్యంగా దేవరగట్టు మాళమల్లేశ్వరస్వామి ఆలయంలో అభిషేకాలు, మహా మంగళారతి, అర్చనలతో పాటు ఇతర ప్రత్యేక పూజలు నిర్వహించి నైవేద్యం సమర్పించారు. ఆలయ నిర్వాహకులు నెరణికి, నెరణికి తండా, కొత్తపేట గ్రామపెద్దల ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేశారు. అలాగే.. హొళగుంద సిద్ధేశ్వరస్వామి, సాయిబాబా మందిరంలో భక్తులు పూజలు చేశారు.

ఎల్లార్తిలో అన్నదానం ప్రారంభం ..



ఎల్లార్తి దర్గాల్లో ఫాతెహాలు నిర్వహిస్తున్న భక్తులు

ఎల్లార్తి శేక్షావలి, షాషావలి దర్గాలకు ఆదివారం ఆంధ్ర, తెలంగాణ, కర్ణాటక, మహారాష్ట్ర తదితర ప్రాంతాల నుంచి భక్తులు భారీగా తరలి వచ్చి దర్గాలో ప్రత్యేక ఫాతెహాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. దర్గాలో కొద్ది రోజులుగా నిలిచిన అన్నదానం కార్యక్రమం దర్గా మాజీ నిర్వాహకుడు మల్లికార్జున, వక్ఫ్‌బోర్డు సహకారంతో ఆదివారం తిరిగి ప్రారంభించారు. అలాగే హొళగుంద సాయిబన్న, చిణిగితాతా దర్గాల్లో పూజలు చేశారు.

కరెంట్ పోతే సిగ్నల్స్ మాయం



హొళగుందలోని ఎయిర్‌టెల్ టవర్

హొళగుంద: మండల కేంద్రంలో విద్యుత్ సరఫరా నిలిచిపోతే ఎయిర్‌టెల్ సిగ్నల్స్ కట్ అవుతుండటంతో సేవలు నిలిచిపోతున్నాయి. దీంతో వినియోగదారులు ఇబ్బందులు పడుతున్నారు. కొద్ది రోజులుగా ఎయిర్‌టెల్ ఇంటర్నెట్ సేవల్లో నెలకొన్న సమస్య ఇటీవల తీవ్రమైంది. దీంతో అత్యవసర పనులున్న వారు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మండల కేంద్రంలో బీఎస్‌ఎన్‌ఎల్, ఎయిర్‌టెల్ మినహా మిగిలిన నెట్‌వర్క్‌లు సరిగా పనిచేయడం లేదు. బీఎస్‌ఎన్‌ఎల్ సిగ్నల్స్ కొన్ని ప్రాంతాల్లో మాత్రమే వస్తుండగా.. అంతో ఇంతో పనిచేసే ఎయిర్‌టెల్ కొద్ది రోజులుగా పనిచేయకపోవడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. సిగ్నల్ సమస్య వేధిస్తున్నా నిర్వాహకులు స్పందించకపోవడంపై వినియోగదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సాంకేతిక లోపాన్ని సంస్థ యాజమాన్యం వెంటనే పరిష్కరించి మెరుగైన సేవలు అందించేలా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేస్తున్నారు.

వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పు చరిత్రాత్మకం



పత్తికొండలో అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

తుగ్గలి(పత్తికొండ) : ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు చరిత్రాత్మకమని ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకులు తిరుపాల్ అన్నారు. ఆదివారం పట్టణంలోని రామకృష్ణనగర్‌లో అంబేడ్కర్, ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మందకృష్ణ మాదిగ చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. ఆయన మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణకు సుప్రీంకోర్టు ధర్మాసనంలోని ఆరుగురు జడ్జిలు సరైనదేనని చెప్పడం సంతోషంగా ఉందన్నారు. నాయకులు వెంకటేశ్వర్లు, రమేష్, రాజు, నాగరాజు, బాలు, రవికుమార్ పాల్గొన్నారు.

ఆస్పరి: ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పుపై హర్షం వ్యక్తం చేస్తూ ఆదివారం మండలంలోని నగరూరు గ్రామంలో ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో సంబరాలు చేసుకున్నారు. ముందుగా గ్రామంలోని అంబేడ్కర్ విగ్రహానికి పాలాభిషేకం చేసి నివాళులర్పించారు. అనంతరం నాయకులు గోవిందరాజులు, భీమన్న, మోహన్, చిన్న నరసన్న, సోమశేఖర్, ఈరన్న, రామాంజినేయులను శాలువ,పూలమాలలు వేసి సన్మానించారు.